అసమర్థుడు

కోటరాధాకృష్ణమూర్తి

ఉదయం పదిన్నర కావస్తోంది. అదరా బాదరా భోంచేసి ఆఫీసుకు వచ్చేను. వచ్చి కూర్చున్నదే తడవుగా ఫైల్సులో మునిగిపోయాను. ఇంతలో ప్యూను ఆఫీసు తపాల్సు తీసుకొని వచ్చాడు. నా సీటుకు సంబంధించిన కాగితాలు తీసుకొని సంతకం పెట్టి ప్యూనును పంపించేశాను. వచ్చిన కాగితాలను తిరగేస్తుంటే నా దృష్టి ఒక కాగితం మీద నిలచిపోయింది. అది ఎవరో శేఖర్ అనే

వ్యక్తియొక్క అర్జీ. ఉద్యోగానికై పెట్టుకో బడిన పిటిషన్. దానిమీద "Appointed putup proceedings immediately." అని వ్రాసి యున్నారు. దానిని చూస్తుండ గానే నా మనస్సు ఆరు నెలల క్రితానికి తిరిగిపోయింది.

నేను ఉద్యోగం లేక నానా బాధలు పడుతున్న రోజులవి. కాళ్ళు వాచేలా తిరిగాను. నోరు నొప్పిపుట్టేలా ప్రతి ఆఫీసరునీ బ్రతిమాలాను. కనిపించిన ప్రతి అడ్వర్టైజ్‌మెంటుకూ ఒక అర్జీ పడవేశాను. కాని ఫలితం శూన్యం. నిరాశ, నిస్పృహలతో సంచరిస్తున్న నాకు ఆపద్బాంధవుడిలాగా ప్రత్యక్షమైనాడు ఆనందం. నా చిన్ననాటి స్నేహితుడు, గొప్ప ధనికులబిడ్డ. వాళ్ళ నాన్న గారి ద్వారా ఆఫీసరుకు చెప్పించాడు. ఆఫీసరు సరేనన్నాడు. ఆనందం నాచేత ఒక అర్జీ వ్రాయించి వాళ్ళ నాన్నగారిచే ఒక ఉత్తరం వ్రాయించి రెండూ ఆఫీసరుకు పర్సనల్‌గా ఇమ్మని చెప్పాడు. పట్నం పోవడానికి నా దగ్గర డబ్బులు లేవు. గుటకలు మ్రింగుతుంటే నా పరిస్థితి గ్రహించిన ఆనందం ఒక వంద రూపాయలిచ్చాడు. పట్టరేని సంతోషంతో ఆనందంకు మరీమరీ కృతజ్ఞతలు తెల్పి పట్నం బయలుదేరాను. ఆఫీసరును కలుసుకొని అర్జీ, ఉత్తరం రెండూ అందజేశాను.

అర్జీమీద వారు "Appointed in the existing vacancy, putup immediately a detailed note" అని ఆర్డరువేసి ప్యూనును పిలిచి Headcleck గారికి ఇమ్మని తపాలులో క్లర్కుకు పంపమని చెప్పారు, నన్ను ఎష్టాబ్లిష్‌మెంట్ గుమాస్తాయైన బి 1 ను కలుసుకోమని చెప్పారు. నేను అలాగే బి 1 సీటుదగ్గరకు వెళ్లాను. టైం 10-30 అయింది, కాని ఇంకా బి, గారు రాలేదు. పదిహేను నిముషాలు అలాగే కూర్చున్నాను. కాని వారు ఇంకా రాలేదు విషయ మేమిటా అని వాకబుచేయగా వారు అంటే సదరు బి 1 గారు అవర్ పర్మిషన్ పెట్టారని తెలిసింది. గడియారంవైపు చూస్తూ అలాగే కూర్చున్నాను. 11-30 అయింది. కాని వారు రాలేదు. నాలో ఆతృత ఎక్కువైంది. వారు వస్తారా? రారా? అని ఎవరిని అడిగినా సరియైన సమాధానం రాలేదు. వారు సరిగా ఒంటిగంటకు వచ్చారు.

వచ్చినదే తడవుగా ముఖము తుడుచు కొంటూ కుర్చీమీద కూర్చొన్నారు. నమస్కారం పెట్టాను. ఎవరు మీరు "అని అడిగారు. పరిస్థితి వివరించాను. నాకు త్వరగా పోస్టింగ్ ఆర్డరు ఇమ్మని నవినయంగా మనవిచేశాను. వారి పెదవుల మీద చిరునవ్వు కన్పించింది. అప్పుడే ప్యూను ఇచ్చిన టపాల్ కాగితాలన్నీ



చూశారు. నాకాగితం పైకి తీసి సొంతం చదివారు. "ఇప్పుడే నేను వ్రాయవల సిన పైల్సు అర్జంటివి చాలా ఉన్నవి. మీరు రేపురండి" అని శెలవు ఇచ్చారు. నాకు చెమటలు పోశాయి ఎంతో నిరాశ చెందాను. నేను చాలా దూరం నుంచి వచ్చాననీ, పోయిమళ్ళీరావడం కుదర దనీ, ఎంతో ఆశతో వచ్చాననీ, ఎదేదో బతిమాలాను. వారి ముఖంలో మళ్ళీ చిరునవ్వు కన్పించింది. లేని చెమటను తుడుచుకొంటూ, చొక్కా కాలరును తడుముకొంటూ లేవారు వారి వెంట నేనూ లేచాను. వారు నేరుగా హోటల్‌లోనికి వెళ్ళారు. నేను భోంచేసి వచ్చాను. కాని వారితోటి అక్కడిదాకావచ్చి ఆగిపోవడం మర్యాదకాదు గనక, నేనుకూడా వారితోటి హోటలోనికి వెళ్లాను. ఇద్దరం ఎదు రెదు రుగా ఆసీనులమయ్యాము. మీరేమన్నా తీసుకొంటారా? అని అడిగారు. ఏమీ తీసుకొనకపోతే బాగా ఉండదనుకొని కాఫీ అని చెప్పాను. వారుమాత్రం స్వీటు, హాట్ తీసుకొన్నారు. బోర్న్‌వీటా త్రాగారు. సర్వర్ బిల్లు మా ఇద్దరిమధ్య పెట్టివెళ్లాడు. వారు బిల్లుచూచి కూడా చూడనట్లు లేచి బయలుదేరారు. నాకు తప్పలేదు. బిల్లు తీసుకొని చూచాను. రెండూ రూపాయయిలు! గుండె ఆగి పోయినంత పనిఅయింది. కాని ఏం చేయను. బిల్లు చెల్లించి బయట పడ్డాను. వారు బయట నిలబడి నాకోసం ఎదురు చూస్తున్నారు. నేను వారిని కలుసు కొన్నాను. వారు జేబులన్నీ తడుము కొన్నారు. ఏమిటి సార్ అని అడిగాను అర్థంగాక. "సిగరేట్ ప్యాకెట్, వక్కపొడి ఎప్పుడూ నా జేబులోనే ఉండేవండీ. ఇప్పుడు వెదకితే కనబడ్డంలేదు. బహుశా

ఇంట్లో పెట్టేసివచ్చి ఉంటాను. మీదగ్గర డబ్బులుంటే సిజర్ ప్యాకట్, కిళ్లీ ఒకటి తీసుకోండి'' అన్నారు. నాకు వళ్ళుమండింది. కాని తమాయించు కొన్నాను. '—అతని అవసరం నాకు ఇప్పుడు చాలా ఉంది. నా భవిష్యత్తు అతని చేతిలో ఉంది. మంచిగా ఉండి తొందరగా పని చేయించుకో వాలనుకున్నాను.'—సిజర్ ప్యాకట్, కిళ్లీకొని అతనికి ఇచ్చాను.

కిళ్ళీ వేసుకొని, సిగరేట్ కాలుస్తూ బయలుదేరారు. వారి వెంబడే నేనూను. నా గురించి అన్ని విషయాలు అడిగి తెలుసుకొన్నారు. సీటులో కూర్చున్నారు. అంతే, అంతకుముందున్న నవ్వు మాయ మయింది. సీరియస్ పోజ్ పెట్టారు. ముఖం వంచేసుకొని ఏదేదో రాస్తున్నారు. ''సార్, నా కాగితం ముందు వ్రాయండి. మీకు పుణ్యముంటుంది.'' అని బ్రతిమా లాడాను. ''నిన్న వచ్చిన కాగితాలే ఇంకా వ్రాయలేదండీ, ఏ పనిఅయినా సీరి యస్‌గా చేయాలి కదండీ. రేపు తప్పని సరిగా వ్రాస్తాలేండి'' అన్నారు. నాకు మతి తిరిగి పోయింది. హెడ్ క్లార్కుతో పోయి చెప్పాను. వారుకూడా బి 1 గారినే సపోర్టు చేశారు. నాకేమీ బోధపడలేదు. నిరాశగా ఆఫీసుముందు చెట్టుదగ్గర కూర్చున్నాను. నాలో ఆలోచనలు రేగు తున్నాయి. ఎంతో ఆశతో వచ్చాను. రేపుకూడా ఇక్కడ ఉండాలంటే బోలె డంత ఖర్చు. ఆనందం ఇచ్చిన 100 రూపాయలతో ఛార్జీలకు, ఇక్కడ బి 1 ను మేపినందుకు మొత్తం పది రూపాయలు అప్పుడే అయిపోయినవి. ఉద్యోగంలో చేరి, 1 వ తారీఖు జీతం వచ్చేంతవరకు ఈ డబ్బుతోనే కాలం గడపాలి. రేపు కూడా ఇక్కడే ఉంటే ఇంకెంత అవు తుందో? అని. ఇంతలో ప్యూను నా దగ్గరకువచ్చి సంగతి ఏమిటని అడిగాడు. జరిగిన విషయమంతా చెప్పాను. ''నేను చెప్పినట్లు చేస్తే మీకు తొందరగా పని అవుతుంది.'' అని చెప్పాడు. ఆ మాటతో నాకు ఏనుగంత బలం వచ్చింది. ''నీవు ఏమి చెప్పినా చేస్తాను. గంగలో దూకమన్నా దూకుతాను. అన్నాను.'' అంతపని అక్కరలేదు సార్, హెడ్ క్లార్కుకు ఒక 50 రూ॥లు గుమాస్తాకు 25 రూ॥ లు నాకు రెండు రూపాయలిస్తే మీపని నిముషాలలో అయిపోతుంది సార్.'' అన్నాడు. నాకు భూమి తిరిగి పోతున్నట్లన్పించింది. తమాయించుకొని నిలబడ్డాను.--'అఫీసరుతో రిపోర్టుచేస్తే'-- అని మనసులో అనుకొన్నాను. నా మన స్సులోని భావాన్ని పసిగట్టి నాడేమో? ప్యూను ''మీరు అఫీసరు దగ్గరకువెళ్ళి చెప్పుకొన్నా ఏమిలాభంలేదు సార్. క్లార్కు, హెడ్ క్లార్కు, ఏదో సాకులు చెప్పి అసలికే మోసం తెస్తారు. మీరు ఏమియిచ్చినా ఇప్పుడే గదండీ ఇస్తారు.

అటు తర్వాత మీరూ పుచ్చుకొనే వారేగదా అవుతారు'' అన్నాడు. క్షణం ఆలోచించాను. ఎంతో కాలంనుంచి ఎదురు చూస్తున్న ఉద్యోగం రాబోతుంటే కాలదన్నుకోవడం తెలివి తక్కువ అన్పిపించింది. దేవుడు వరమిచ్చినా, పూజారి వరమివ్వ లేదనేది ఇదేనని అప్పుడు తెలిసివచ్చింది. ఏమైనా సరే అనుకొని జేబులోంచి 77 రూ॥ లు తీసి ప్యూనుకు ఇచ్చాను. వాడు సలాంకొట్టి వెళ్లిపోయాడు.

అంతే! ఒక గంటలో నోట్ అప్రూవ్ గావడం, ప్రొసీడింగ్స్ పెట్టడం, టైప్ అయి సంతకం గావడం నాదగ్గరకు రావడం అంతా జరిగిపోయింది. నన్ను రాయవేలూరుపోస్టు చేశారు. నేను వెంటనే వెళ్ళి జాయినయ్యాను. కాని ఆనందం ఇచ్చిన 100 రూ॥ లు అప్పుడే అయిపోయినవి. ఎంతోబాధపడవలసి వచ్చింది. ఉద్యోగ జీవితం అప్పులతో ప్రారంభం అయింది. అప్పు చేయడం, మళ్ళీ తీర్చడం, మళ్ళీ చేయడం, మళ్ళీ తీర్చడం ఇలా చక్రంలాగా నా జీవితం ఇప్పటికి తిరుగుతూనే ఉన్నది. మిగులు అన్నది ఎండమావులయిపోయింది. రాయవేలూరునుండి నన్ను మళ్ళీ ఇప్పుడు పట్నానికే మార్చారు. ఆ బి I సీటులోనే నన్ను వేశారు. కాని ఆ హెడ్ క్లార్కు, ఆ ప్యూన్ ఇప్పు డిక్కడ లేరు. బదిలీ అయి వెళ్ళిపోయారు. గతాన్ని తల్చుకొంటూంటే, ఆనాడు నేను పడిన ఆతృతి, ఆవేదన నెమరువేసుకొంటూంటే, కళ్ళల్లో నీళ్లు వస్తున్నాయి.

ఆ అర్జీని మళ్ళీ ఒకసారి చదివాను. నా మాదిరి ఈ శేఖరం బాధ పడడానికి వీల్లేదు. ఇతని పని వెంటనే చేసేసి తృప్తితో నిండిన అతని కళ్ళనుచూసి ఆనందించాలనుకున్నాను. నోట్సు వ్రాసి నేనే స్వయంగా హెడ్ క్లార్కు దగ్గరకు తీసుకుని వెళ్ళాను. ఆయన ఆ ఫైలుచూసి దీని కిప్పుడేం తొందర. నీ మామూలు నీకు ముట్టిందేచాలా! మిగతా వారందరు ఏమి కావాలి. అక్కడ పెట్టిపో'' అన్నారు. నేను చాలా బాధపడ్డాను. మాట్లాడకుండా ఆ ప్యాడు అక్కడే పెట్టేసి వచ్చేశాను.

'ఛీ, ఈ లోకం ఎంత నీచమైంది' అని ఆలోచిస్తూ కూర్చున్నాను. గుడ్ మార్నింగ్ అన్నమాట వినగానే తల పైకెత్తి చూచాను. తెల్లచొక్కా, నల్ల ప్యాంటు తొడుక్కొని, చామన చాయ కల్గిన ఒక యువకుడు ఎదురుగా నిలబడియున్నాడు. ''నా పేరు శేఖర్ సార్. నన్ను అపాయింటుచేస్తూ ఆఫీసరువారు ఆర్డరుచేశారు. మీకు కాగితం వచ్చేఉండవచ్చు. మీరు పోస్టింగ్ ఆర్డరు ఇచ్చివేస్తే నే వెళ్ళిపోతాను. అరే అసలు మ్యానర్సే మరచిపోతున్నాను. రండిసార్ కాఫీకి పోతాం'' అన్నాడు ఏక ధాటిగా. ''వద్దండీ



నేను ఫోంచేసి వచ్చాను'' అన్నాను. ''సిగరెట్ త్రాగుతారా?'' అంటూ ఒక సిగరెట్ ఇవ్వబోయాడు ''Thanks వద్దండీ'' అన్నాను అతను తెల్లబోయాడు. కొంచెం సేపటికి సర్దుకొని మీరుచాలా Honest గా ఉన్నట్లున్నది. నా ఫైల్ కొంచెం........''అంటూ చేతులు నలుపు కొంటూన్నాడు. మీ ఫైల్ వ్రాసి హెడ్ గుమాస్తాగారి బల్లమీద పెట్టాను. వారు చూడడం లేదు.'' అని చెప్పాను. అతను వెంటనే హెడ్ గుమాస్తాగారి దగ్గరకు వెళ్ళాడు. అటు తిరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. 10 నిముషాలలో నోటు అప్రూవ్అయి వచ్చింది. వెంటనే ప్రొసీడింగ్సు కూడాపెట్టి హెడ్ క్లార్క్ బల్లమీద పెట్టడానికి వెళ్ళాను. హెడ్ క్లార్క్ గాని, ఆ రూంలో కెళ్ళిన శేఖర్ గాని అక్కడ లేరు. ప్యాడ్ బల్లమీద పెట్టేసి వచ్చాను. ఒక అరగంటలో ప్రొసీడింగ్సు కూడా అప్రూవయి వచ్చింది. వెంటనే టైప్ చేయించాను. ఆర్డరు తీసుకోవడానికి శేఖర్ దగ్గరకు వచ్చాడు. నేను ఆశించిన తృప్తి అతడి కళ్ళల్లో కన్పడడం లేదు. అతని కళ్ళల్లో కన్పిస్తున్నదల్లా ఒక రకమైన డంబము. ''యీఫైల్ ఇంత త్వరగా హెడ్ క్లార్క్ దగ్గరనుండి కదుల్తుందను కోలేదండి.'' అన్నాను ఉండబట్టలేక. ''అవునుసార్, తైలం ఉంటే కొండమీది కోతినైనాదింపింపవచ్చునండీ.'' అన్నాడు. నాకు అర్థమైంది. నేను మౌనం వహించాను. ఆర్డరు తీసుకొని వెళ్తున్న అతనికి కిటికీ దగ్గర ప్యూన్ ఎదురైనాడు. అతని కేదో ఇస్తున్నాడు శేఖర్. నాకు వాళ్ళమాటలేవీ వినబడలేదు. శేఖర్ అన్న చివరి మాటలు మాత్రం వినబడ్డాయి. ''ఏమిటోయ్ మీ బి 1 వట్టి అసమర్థుడిలా ఉన్నాడు. ఏమీ పుచ్చుకోలేదు.''

———